క్లుప్తంగా

జంట గ్రామాల్లో 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'



వేపాడలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీ

వేపాడ: మండల కేంద్రమైన వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ రవికుమార్ నేతృత్వంలో ర్యాలీ నిర్వహించి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వేపాడ చెత్త సంపద కేంద్రం వద్ద పరిసరాలను పరిశుభ్రం చేశారు. తడి, పొడి చెత్త వేరుచేయుట.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు.. నీటి పొదుపై వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఆయుష్ వైద్యులు, స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ పర్సన్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా నువ్వు సాగు



వీరభద్రపురం వద్ద సాగులో ఉన్న నువ్వుపంట

కొత్తవలస: నియోజకవర్గ పరిధిలో సాగు చేస్తున్న నువ్వు పంట ఆశాజనకంగా ఉంది. లక్కవరపుకోట, వేపాడ, జామి, కొత్తవలస, శృంగవరపుకోట, జామి మండలాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో నువ్వు సాగు చేస్తున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న పంట ఏపుగా పెరిగి పూత దశకు చేరుకుంది. మరికొద్ది రోజులు వాతావరణం సహకరిస్తే అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ పనులు



రేగ గ్రామ సమీపంలో నారుమడి కోసం విత్తనాలు చల్లుతున్న రైతు

లక్కవరపుకోట: ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు ఖరీఫ్ పనుల్లో బిజీగా ఉన్నారు. వ్యవసాయ పనులు ప్రారంభమైనా ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకపోవడంతో రైతులు అప్పులు చేసి మరీ సాగుకు సిద్ధమయ్యారు. ముఖ్యంగా రేగ, కళ్లేపల్లి, లచ్చంపేట, తదితర గ్రామాల్లో రైతులు వరి నారుమడులు తయారీలో తలమునకలయ్యారు. కొన్ని సచివాలయాల పరిధిలో రాయితీ విత్తనాలు అందజేయకపోవవడంతో రైతులు ప్రైవేట్ డీలర్స్ వద్ద విత్తనాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో ఈ పాటికే విత్తనాలు, ఎరువులు అందజేయడంతో పాటు రైతుభరోసా కింద పెట్టుబడి సాయం కూడా అందించారు.

అందుబాటులో వరి విత్తనాలు



రైతుసేవా కేంద్రంలో ఉన్న వరి విత్తనాలు

మెరకముడిదాం: మండలంలో వరి సాగు చేసే రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి శ్రావణితేజ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. మండలానికి మొత్తం 1967 టన్నుల విత్తనాలు అవసరమని ప్రభుత్వానికి నివేదించగా... ప్రభుత్వం ఇంత వరకు 1678 టన్నులు పంపించిందని చెప్పారు. 1121 రకం, బీపీటీ 3291, బీపీటీ 5204 రకాల విత్తనాలు ఉన్నాయని, కావాల్సిన రైతులు రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

లాభసాటిగా కూరగాయల సాగు



వావిలపాడులో సాగు చేస్తున్న బెండ, ఆనప

వేపాడ: మండలంలోని పలు గ్రామాల్లో కూరగాయల సాగు లాభసాటిగా ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వావిలపాడు, కుమ్మపల్లి, అంకాజోస్యులపాలెం, నల్లబిల్లి, తదితర గ్రామాల్లో బెండ, వంగ, ఆనప, బీర కూరగాయలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. అయితే దిగుబడులను విక్రయించేందుకు మండల కేంద్రమైన వేపాడలో రైతుబజారు లేకపోవడంతో దేవరాపల్లి, కె.కోటపాడు మండలం సంతపాలెం లేదా కొత్తవలస, విశాఖ తీసుకెళ్లాల్సివస్తోందని కూరగాయలు రైతులు అంటున్నారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేపడతామని చెబుతున్నారు.

సీజనల్ వ్యాధులతో ముప్పు



చిట్టేయవలసలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)



పిడిశీల గ్రామంలో ఫీవర్ సర్వే చేపడుతున్న సిబ్బంది

- అప్రమత్తతే మార్గం..
- అవగాహన తప్పనిసరి అంటున్న వైద్యులు

గజపతినగరం రూరల్: వేసవికాలం వెళ్లిపోయి వర్షాకాలం సీజన్ ప్రారంభమైంది. అడపా దడపా వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ సీజన్‌లో ప్రధానంగా డెంగీ, చికెన్ గున్యా, టైఫాయిడ్, మలేరియా, మొదదువాపు వంటి వ్యాధులు ప్రబలుతాయి. కేవలం అప్రమత్తంగా ఉండడం వల్లే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఈక్రమంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు మరుపల్లి పీహెచ్‌సీ పరిధిలోని సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ, ఎంఎల్‌హెచ్‌పీఓలను బృందాలుగా ఏర్పాటు చేసి 30 గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఇంటి చుట్టుపక్కల మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- శరీరం పూర్తిగా కప్పి ఉండేలా సాక్సులు, బూట్లు, ప్యాంట్లు, షర్టులు ధరించాలి.
- దోమలు ఇళ్లల్లోకి రాకుండా కిటికీలు, తలుపులకు సన్నటి జాలీలు ఏర్పాటు చేసుకోవాలి.
- దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలి.
- జనావాసాల మధ్యకు పందులు రాకుండా చూసుకోవాలి.
- ఎప్పటికప్పుడు కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- ఇంటి ఆవరణలో ఖాళీ కొబ్బరి బొండాలు, వాడి పడేసిన టైర్లు ఉండకుండా చూసుకోవాలి.
- ఇంటిలో నిత్యం వినియోగించే రుబ్బురోళ్లు, తిరగళ్లు, ఫ్రిజ్‌లు, కూలర్లు, పూల కుండీలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.

అశ్రద్ధ తగదు..





వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రజలు తమ ఇళ్లతో పాటు చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు వేడి ఆహారం తీసుకోవాలి. వర్షాకాలంలో ఏమాత్రం జ్వరం వచ్చినా అశ్రద్ధ చేయకుండా ముందుగా వైద్యుడ్ని సంప్రదించాలి.

– డాక్టర్ అనూజ్‌కుమార్, డాక్టర్ పుష్పాంజలి, మరుపల్లి పీహెచ్‌సీ

యువత పోరును విజయవంతం చేయండి



యువత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ యువ నేతలు

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పైడపునాయుడు

గజపతినగరం రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కూడలి వద్ద ఈ నెల 23న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం పిలుపు మేరకు చేపట్టనున్న యువతపోరును విజయవంతం చేయాలని యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పైడపునాయుడు పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో యువతపోరకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తయినా ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయిందన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ హామీలు అటకెక్కాయన్నారు. తల్లికివందనం కూడా సగానికి పైగా లబ్ధిదారులకు పడలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోనే రూ.1.58 లక్షల కోట్లు అప్పులు చేసిందన్నారు. ఉద్యోగులు, పింఛనర్లకు డీఏలు, పీఆర్‌సీలు ఇవ్వలేదని మండిపడ్డారు. యువత పోరు కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడుతో పాటు పార్టీ మండలాల అధ్యక్షులు చిరంజీవి, బి.జగదీష్, కె.విజయ్, జి.సురేష్, రవికుమార్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, యువత పాల్గొన్నారు.

పాడి రైతులకు బీమా చెక్కుల పంపిణీ



వేపాడ పాల సొసైటీ కార్యాలయంలో బాధిత రైతులకు చెక్కులు అందజేస్తున్న డెయిరీ మేనేజర్ శివాజీ, తదితరులు

వేపాడ: వేపాడ పాల ఉత్పత్తిదారుల సొసైటీకి పాలు సరఫరా చేసే పాడి రైతుల గేదెలు చనిపోవడంతో విశాఖ డెయిరీ మేనేజర్ శివాజీ పరిహారం సొమ్ము అందజేశారు. శనివారం స్థానిక పాలసొసైటీలో సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి దేముడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేపాడ గ్రామానికి చెందిన నిరుజోగి కృష్ణకు చెందిన ఆవులు ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదంలో కాలిపోవటంతో బీమా కింద రూ. 70 వేల చెక్కును అందజేశారు. అలాగే సహజ మరణం చెందిన పాడి పశువుల యజమానులు గొర్లె అప్పారావుకు రూ. 30 వేలు.. నిరుజోగి రాముకు రూ.40 వేల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాయుడుబాబు, గ్రామపెద్దలు గుమ్మడి భారతి, నిరుజోగి దాలినాయుడు, బి.లక్ష్మణరావు, పీఎస్ సత్యారావు, సిబ్బంది, పలువురు పాడిరైతులు పాల్గొన్నారు. భర్తవానిపాలెం సొసైటీలో బాధిత పాడి రైతులు వి. రామునాయుడుకు రూ. 35 వేలు.. ఎల్.సన్యాసమ్మకు రూ. 40 వేల చెక్కులను సూపర్‌వైజర్ నాయుడు, సంఘ అధ్యక్షుడు వెంకటరమణ, ఉప సర్పంచ్ కండిపల్లి పెదనాయుడు, తదితరులు అందజేశారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



ఆనందపురంలో ఒకేషనల్ కళాశాలకు 1000 లీటర్ల వాటర్ ట్యాంక్ అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

వేపాడ: స్థానిక వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉదయాస్తమాన సేవల్లో (కమ్యూనిటీ సేవా సౌరభాలు) భాగంగా శనివారం ఆరు కార్యక్రమాలు నిర్వహించినట్లు వాసవీ క్లబ్ అధ్యక్షుడు పుట్టా ఈశ్వరరావు, కార్యదర్శి ఉద్దగిరి వెంకటరావు, మాదేటి శ్రీను, తదితరులు తెలిపారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎం. రవికుమార్, ప్రొగ్రాం కో ఆర్డినేటర్ ఎం.విశ్వేశ్వరరావు హాజరయ్యారు. వీరి సమక్షంలో స్థానిక క్లబ్ సభ్యులు చినగుడిపాలలో ఆవుల షెడ్‌కు గరుకు స్తంభం.. చినగుడిపాల, మారిక ప్రాథమిక పాఠశాలకు 50 పుస్తకాలు, 50 పెన్నులు.. బల్లంకిలో రైతుకు యూరియా బస్తా.. వేపాడలో చెప్పులు కుట్టే వ్యక్తికి గొడుగు అందజేయడంతో పాటు ఇద్దరు వ్యక్తులను సన్మానించారు. అలాగే ఆనందపురం ఒకేషనల్ కాలేజీకి 1000 లీటర్ల వాటర్ ట్యాంక్ అందజేశారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ రీజనల్ చైర్మన్ వి.నానాజీ, జోన్ చైర్మన్ కొత్త కిషోర్, సీనియర్ సభ్యులు దుడ్డు శ్రీనివాసరావు, ఎస్ఎస్‌వీ సత్యనారాయణ, విజ్జపు సంపత్‌కుమార్, విన్నకోట శ్రీను, కూరగంగ కొత్త శ్రీను, దుడ్డు వెంకటేష్, ఎస్.అఖిలేష్ ఎస్.సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



సాయికుమార్‌ను అభినందిస్తున్న గుర్ల కళాశాల సిబ్బంది

గుర్ల: అమరావతిలోని ఏపీ విట్‌లో గుర్ల ప్రభుత్వ కళాశాల విద్యార్థి బాలి సాయికుమార్ ఉచిత సీటు సాధించినట్లు గుర్ల కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. ఇంటర్‌లో మెరుగైన మార్కులు సాధించడంతో ప్రతిష్టాత్మకమైన కళాశాలలో సీటు వచ్చిందని చెప్పారు. ఈ మేరకు విద్యార్థిని శనివారం ప్రత్యేకంగా అభినందించారు.

గార, బూడిలకు అభినందనలు



బూడి, గార తవుడులను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం రూరల్: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, గజపతినగరం జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడులను మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో అభినందించారు. ఆరు జిల్లాల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ కో ఆర్డినేటర్‌గా బూడి వెంకటరావు.. అలాగే ఆరు జిల్లాల వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ కో ఆర్డినేటర్‌గా ఎన్నికైన గార తవుడులకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలియజేశారు. బాధ్యతగా పనిచేసి పార్టీకి పేరు తీసుకురావాలని సూచించారు.

అధ్వానంగా రిక్షా కాలనీ రోడ్డు



రిక్షా కాలనీ రోడ్డు దుస్థితి

చీపురుపల్లి: పట్టణంలోని రిక్షా కాలనీకి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. పట్టణంలోని కొత్త అగ్రహారం నుంచి రిక్షా కాలనీకి వెళ్లే రహదారిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నుంచి కాలనీలోకి వెళ్లేంత వరకు రోడ్డుపై రాళ్ల పిక్కలు తేలిపోయాయి. ఈ రోడ్డుపై నడిచి వెళ్లే వారితో పాటు ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

• మర్యాదపూర్వక కలయిక



కొత్తవలసలో కడుబండిని కలిసిన జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, తదితరులు

దత్తిరాజేరు: వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా కొద్ది రోజుల కిందట ఎంపికైన టి. బూర్జవలస గ్రామానికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి అప్పలనాయుడు వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్‌ను.. బొబ్బిలిలో మాజీ ఎమ్మెల్యే శంబంగి అప్పలనాయుడును.. విజయనగరంలో మాజీ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామిని.. కొత్తవలస క్యాంప్ కార్యాలయంలో ఎస్ కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావును.. మోపాడలో నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి పదవి అప్పగించారని, రైతు సమస్యలపై పోరాడి వారికి సేవ చేస్తానని మంత్రి అప్పలనాయుడు ఈ సందర్భంగా తెలిపారు ఆయన వెంట మహదేవ్ ఫణీంద్రుడు, కడుబండి రమేష్‌నాయుడు, దత్తి చిరంజీవి, తదితరులున్నారు.

అంతా యోగ ముద్రలోనే..



ఎస్.కోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో యోగాసనాలు వేస్తున్న వాకర్స్



గజపతినగరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో యోగా చేస్తున్న అభ్యాసకులు



గరివిడి: వెటర్నరీ కళాశాలలో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా వాడవాడలా శనివారం యోగా డే నిర్వహించారు. పభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు.. కార్యాలయాలు.. క్రీడా మైదానాల్లో.. ఇలా ఎక్కడ చూసినా ప్రతి ఒక్కరూ యోగ ముద్రలో దర్శనమిచ్చారు. యోగాతో మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని, జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతుందని శిక్షకులు తెలిపారు. యోగాకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు రావడం మనందరి అదృష్టమని పలువురు అభిప్రాయపడ్డారు. పూర్వీకులు తెలియజేసిన యోగాను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఆరోగ్య భారతమే అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేసి యోగా డే విశిష్టతను చాటి చెప్పారు. గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గాల్లో వాడవాడల్లో యోగాసనాలు వేశారు. – సాక్షి నెట్‌వర్క్

సమ్మెను విజయవంతం చేయండి



కార్మికులతో కలసి వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకురాలు లక్ష్మి

దత్తిరాజేరు: జూలై 9న దేశ వ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ సంఘాలు చేపట్టనున్న ఒక్క రోజు సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకురాలు లక్ష్మి పిలుపునిచ్చారు. ఈ మేరకు కోమటిపల్లిలో ఆటో కార్మికులతో కలిసి సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధానిగా మోదీ మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత 42 కార్మిక చట్టాలను రద్దు చేయడం దారుణమన్నారు. కార్మికులకు అన్యాయం చేసి, కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రజలను అన్ని రకాలుగా మోసం చేస్తున్నారని.. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దాలినాయుడు, గౌరి, అప్పలనాయుడు, గౌరీష్, రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయండి



మాజీ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

డెంకాడ: వైఎస్సార్ సీపీ మరింత బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు సూచించారు. మండలంలోని మోపాడ గ్రామంలో ఇటీవల నియమితులైన పార్టీ వివిధ అనుబంధ విభాగాల నాయకులంతా మాజీ ఎమ్మెల్యేను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి ఆ పదవులు రావడంలో కృషి చేసినందుకు గాను ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, రెట్టింపు ఉత్సాహంతో పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలని తెలిపారు. అలాగే ఈ నెల 23వ తేదీన చేయనున్న విద్యార్థుల పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పార్టీ ఉపాధ్యక్షుడు పతివాడ సత్యనారాయణ, పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడు డోల మన్మథకుమార్, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలు పతివాడ కృష్ణవేణి, పార్టీ నాయకులు లెంక లక్ష్మణరావు, సోషల్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



వెంకటరావు దంపతులను సన్మానిస్తున్న సహోపాధ్యాయులు

శృంగవరపుకోట: మండల పరిధిలోని సంత గవిరమ్మపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన లగుడు వెంకటరావును పాఠశాల ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు, ఎంటీఎస్ ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇందుకూరి అశోక్‌రాజు మాట్లాడుతూ.. వెంకటరావు నిబద్ధతగా పనిచేసి అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు. ఎంటీఎస్ అధ్యక్షుడు శివరావు మాట్లాడుతూ.. ఎంటీఎస్ ఉపాధ్యాయులకు ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించే గుణం వెంకటరావు సొంతమన్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్రి మోహన్‌రాజు మాట్లాడుతూ. వెంకటరావు చేసిన సామాజిక సేవలను గుర్తు చేశారు అనంతరం వెంకటరావు దంపతులను సన్మానించారు. పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయుడు కె. బంగారునాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చిప్పాడ సూరిబాబు, పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొల్లు సూరిబాబు, తమటాపు అప్పారావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.